సైనిక సమాచార్ వారపత్రిక: 9-10-1960

# మారిన జీవితం

ప్రియమైన రఘుపతిగారికి,

'బావా' అనటం కన్న నీ పేరుతోనే సంబోధించటం వుచితమని, అప్రియమైనా, ప్రియమైన రఘుపతిగారికి అనంటున్నా!

అనాటి అర్థరాత్రి సమయంలో ఆ విషాద ఘటన ఎలా ప్రారంభమై ఎలా అంతమైందో నీ స్మృతిపథంలోంచి చెరిగిపోలేదనుకుంటాను! నిజంగా అనాడు, అనాడేమిటిలే, ఆ రాత్రి, మన జీవితాల్లో, ఒక విషాద ఘట్టం, పీడకల. ఆ రాత్రి నువ్వలా, ఆ విధంగా ప్రవర్తిస్తావనిగాని, నీలో యింకా చిన్ననాటి చిలిపితనం, మమకారం, సానుభూతి, స్థిరంగా నిలిచియున్నాయనిగానీ, నేనెన్నడూ భావించలా! ఏ దురదృష్ట ఘటన సంభవించకూడదనుకున్నానో, అదే జరిగింది. నిజంగా అది నా దురదృష్టం. అందువల్ల యిహ అంతర్యంలోని అంతరార్థం నీకు తెలియజెయ్యాలనే నీకీ లేఖ వ్రాస్తున్నది.

ఆ రోజు అసలే చికాకుతో బయలుదేరా ఆఫీసుకు. తీరా ఆఫీసు కొచ్చేసరికి హెడ్ ఆఫీసు నుంచి యిన్స్‌పెక్షన్‌కు మేనేజరు వస్తున్నట్లు తెలిసింది. మూలిగే నక్క మీద తాటికాయ పడ్డట్టయింది. అస్తవ్యస్తంగా వున్న మనస్సుని కూడ తీసుకుని ఒక్కొక్క కాయితమే టైపు చెయ్యటం ప్రారంభించా!

నువ్వే వస్తావనుకోలేదు. గ్లాస్కో లాల్చీ, గ్లాస్కో ధోవతి, చందమామ లాంటి మొహం మీద దోబూచులాడుకుంటున్న ముంగురులు, పెదాలపై చెరగని చిరునవ్వు.... నిజంగా ఆ రూపంలో నేను గాక మరే స్త్రీ అయినా నిన్ను చూస్తే, పవిత్రమైన తన దేహాన్ని నీ పాదాలముందు అర్పణ చేసుకోదూ? తన జీవితాన్నీ, సౌఖ్యాన్నీ, నీ బలీయమూ, సుందరమైన దేహానికి పెనవేసుకు, నీలో లీనమౌతుంది.

ఒక్క సందేహం బావా! స్త్రీ వల్ల పురుషుల జీవితాలు తారుమారవుతాయంటారు గదా! అందులో స్త్రీయేనా దోషి? మోహనరూపంలో స్త్రీల వివేక, విచక్షణా జ్ఞానాన్ని పొగొట్టే నీలాంటి మన్మథుల సంగతేమిటి?

అసలు విషయం వదిలేసి, ఏమిటేవిటో వ్రాస్తున్నాను గదా? ఆఫీసులో నీవు అడుగు

పెట్టిన దగ్గర్నుంచీ, నీ ప్రవర్తన గురించే ఆలోచిస్తూ పడుకున్నా! నిజంగా నాకెందుకో ఆ నాటి నీ ప్రవర్తనలో ఏదో క్రొత్తదనం, వింత ప్రస్ఫుటమయ్యాయి. నీవు ఆఫీసు చెకింగ్ చేస్తున్నావే గానీ నీ దృష్టి వేరేచోట వుందన్న సంగతీ తెలుసు, నీ చూపుల తూపుల నుంచి ఆత్మరక్షణ ఎలాగా అని నే మధనపడుతూ ఉన్న సంగతీ నీకు తెలుసు కదూ? అబద్ధమాడకు! నిజంగా నీకు తెలిసినా తెలియకపోయినా, కావాలని నన్ను చాలాసార్లు పిలిపించావు. ఏమిటేవిటో అడిగావు. అప్పుడు నిన్ను చూస్తుంటే నీ ఠీవి, దర్పం నాకు సంతోషం, ముచ్చట కలిగించాయి. వేరొకవంక మనిద్దరిమీద తదితరుల అనుమాన దృష్టులు పడతాయేమో అన్న సంకోచం. తనివితీరని నీ ముఖారవిందం.... అప్పటి నా స్థితి వూహించుకుంటూ పరున్న నాకు నువ్వు కనిపించేసరికి, భ్రాంతి, భయం, అనుమానం, సంకోచం అన్నీ కలిగాయి ఒక్కసారి!

నువ్వు మాత్రం నిశ్చింతగా నవ్వుతూ, "మరదలుపిల్లకై మనసుపడి వచ్చినందుకు మంచి మర్యాదలే అందుకున్నాను!" అని అన్నదాకా నేను మంచం మీదున్న సంగతీ, నీవు నిలబడున్నావన్న జ్ఞానం కలగలేదు.

నా ముందున్న నువ్వు, కిటికీలోంచి గదిలో పడుతున్న వెన్నెల - యిదంతా కల కాదని జ్ఞప్తికి వచ్చేసరికి తల నరికేసినట్లయి చాలా బాధపడ్డా. ఆ బాధ వర్ణనాతీతం. నువ్వు నా కోసం మా వూరు వచ్చానని అన్నావు. నిజం. నా కోసమే నువ్వు ఆఫీసు చెకింగ్ పేరిట వచ్చావు. అధికారపు హోదాలో వస్తే తప్ప, నిన్ను గౌరవించనన్న అనుమానం నీకుంది గదా! నిజంగా అదే నీ వుద్దేశ్యమైతే నీవు పొరబడ్డావని చెప్పక తప్పదు. ఎప్పుడూ, నా హృదయ పవిత్ర పీఠంలో వుంచుకుని నిన్ను ఆరాధిస్తూనే వుంటా! యిది చెరగని సత్యం!

ఎంతసేపటికీ నేను మాట్లాడకపోతే గదూ - "వెళ్ళిపొమ్మని పరోక్షంగా చెప్పటమేనా నీ ఉద్దేశ్యం యమునా?" అని అన్నావు; కొద్దిగా కోపం ధ్వనించింది నీ మాటల్లో.

"లేదు బావా! మనసు సరిగ్గాలేక...." మనసు స్థిమితం లేకనే మాట పూర్తిచేయలేకపోయా.

"అదేమిటో తెలుస్తే?"

"ఒకరికి చెప్పేది కాదు బావా!"

కొన్ని క్షణాలు నిశ్శబ్దం ఆవరించింది గదిలో మనిద్దరి మధ్య.

"బావా! నువ్విక్కడకు రావటం ఎవరూ చూడలేదు గదా?"

ఎందుకో నాకా అనుమానం కలిగింది. ఆ అనుమానం కలగటం వల్లే నేను నీ ముందు సరిగ్గా ప్రవర్తించలేదని నీవనుకున్నా, అందులో నా దోషమేమీ లేదు. స్త్రీ జీవితం చాలా భయంకరం బావా! అతి సున్నితమైన స్త్రీ హృదయంలో గూడ ధైర్యం, ఓర్పు వున్నా, అవి కొంతకాలానికి నిరుపయోగమవుతాయి. అదే నా జీవితంలో సంభవిం

చింది. నా చరిత్ర సమస్తం నీకు తెలియదు. తెలిస్తే నాటి రాత్రి...."యమునా...." అంటూ నన్ను నీ గుండెల్లో పొదుపుకో ప్రయత్నించలేవు. నీ ఆ ప్రవర్తనకు నాకు చాలా విచారమే కలిగింది. ఆ విచారం వల్లనే నిన్ను దూరం నెట్టివేయక నెమ్మదిగా ప్రక్కకు తప్పుకున్నా.

"నీలో చిన్ననాటి ఆవేశం అలానే వుంది బావా! ఏం? నీ కర్థంగాదు నా ప్రశ్న!.... ఒంటరిగా వున్న ఆడదాని గదిలోకి రావటం తప్పు. పైగా యిలా...."

చక్రాల్లాంటి నీ కళ్ళు మరీ పెద్దవయినాయి.

"యిదంతా మర్చిపో బావా! ఈ యమున నీతో చెట్టాపట్టీలేసుకుని చెరువు గట్టుమీది రావిచెట్టు దగ్గరికి, మామిడి తోటల్లోకి, వేణుగోపాలస్వామి కోవెల్లోకి చెంగున గెంతిన యుమున కాదు. ఆనాడు మనలో అమాయకత్వం తప్ప మరేమీ లేదు. నే తినగా మిగిలింది నువ్వు లాక్కుపోయి తినేవాడివి. నే మూతి ముడుచుకు కూర్చుంటే నన్ను మంచి చేసుకోటానికి నీవు చేసే ప్రయత్నాలు నాకు నవ్వు పుట్టించేవి. నవ్వేసేదాన్ని. అలా నవ్వలేను నేను ప్రస్తుతం. సెలయేటి శబ్దం లాంటి ఆ నవ్వు కాలానికి, పరిస్థితుల ప్రభావానికి యింకిపోయింది. ప్రయత్నపూర్వకంగానైనా ఆనాటి యమునను కాలేను బావా...."

"అలా అధైర్యపడకు యమునా! నీలో తిరిగి చిన్ననాటి నా యమునను ప్రతిష్ఠించు కోగలను యమునా?"

నీ మాటల్లోని ప్రతి అక్షరంలోను ధైర్యం, చిత్తశుద్ధి, ఆవేశం, ఆశ ప్రతిఫలిస్తున్నయ్. నీకా నమ్మకముంటే ఉండవచ్చు. నీ సంకల్పం బలమైందే! నే కాదనను. కానీ నాలో నాకే నమ్మకం లేదు. నా ఆశలన్నీ అంతరించి నిరాశా జీవితాన్ని మాత్రమే గడుపుతున్నా.

"ధన్యురాల్ని బావా! నాపై నీకింకా అంత ప్రేమ, వాత్సల్యం, అనురాగమున్నందుకు. కానీ..... కానీ ఆ సమయం మించిపోయింది. నా జీవితం వెలుగు ఆశల్లోంచి నైరాశ్యంలోకి అడుగు పెట్టింది బావా!"

"యమునా! నీ మాటలు, చేష్టలు చాలా తమాషాగా వున్నాయి. నీ మాటల వెనుక ఏదో నిగూఢ రహస్యమున్నట్టుంది. వాటితో నాకు ప్రమేయం లేదు. నాక్కావల్సింది నువ్వు. నీ కోసం వచ్చాను. నిన్ను కోరి వచ్చాను. నా ఈ కోరిక కాదనకు. సమస్తం నీ ముందుంచుతాను. నీ కోసమే, యమునా, ఈ జీవితానికి యింతవరకు ఆలంబనము చూచుకోలేదు. నువ్వున్నావుగా జీవితాన్ని నడిపించటానికన్న నమ్మకంతోటే నిశ్చింతగా వున్నాను."

నే సమాధానం చెప్పలేదు కదూ! ఏం చెప్పేది! ఏమని చెప్పేది?

"యమునా! ఊహ తెలియకముందు, ఆ తర్వాత, నిన్ను తప్ప నేనెవ్వరినీ దీక్షగా చూడలేదు. ప్రేమించలేదు. యిన్నాళ్ళుగా నీ జాడ నాకు తెలియదు. స్వదేశం వచ్చినప్పటి నుంచీ నీకోసం నిద్రాహారాలు మాని వెతుకుతున్నాను. యిన్నాళ్ళకు నీవు కనుపించావు.

ఆనాడు మనం చేసుకున్న బాసలు, పెంచుకున్న ఆశలు, ఆశయాలు అన్నీ ఒక్కసారి జ్ఞప్తికి తెచ్చుకో! తల్లి, తండ్రీలేని అనాధుడు యమునా ఈ రఘుపతి. ఈనాడు నీ ప్రేమభిక్ష కోరుతున్నాడు నీ ముందు దీనంగా!"

నిన్ను చూస్తుంటే జాలి వేస్తున్నది. నీ చరిత్ర ఊహాపథంలోకి వస్తే, హృదయం ద్రవీ భూతమవుతుంది. కానీ బావా నేను అసహాయురాలను, ఏం చేసేది? ఎలా నా గాధ నీకు తెలియజెప్పేది? అందుకే బావా ఆనాడు మౌనంగా వున్నది. నా అసహాయ స్థితిని గుర్తించలేక, నన్ను అపార్థం చేసుకున్నావు.

"మాట్లాడవేం యమునా! నన్నెందుకిలా హింసిస్తావ్. సమాధానం చెప్పు. ఈ అనాథ రఘుపతి అర్ధాంగిగా వుండటానికి అంగీకారమో కాదో చెప్పు. వెళ్ళిపోతాను."

"బావా!..... ఊహ తెలియనప్పుడు చేసుకున్న ప్రమాణాలు, పెంచుకున్న ఆశలూ సఫలీకృతం కావడం మన విధిలో వుంటుంది కానీ, మన యిష్టాయిష్టాలతో వుండదు బావా!...."

"అదంతా నాకనవసరం. నేనడిగినదానికి సమాధానం చెప్పు.... మౌనం అంగీకారం అనుకోవచ్చా?"

"లేదు."

"మరి?!"

"నా వివాహం వేరొకరితో నిశ్చయమైంది."

"యమునా! నిజమా!"

నిన్ను చూస్తే జాలివేసింది. నెత్తిని పిడుగు పడ్డా అంత చలించవు. నీలో నరనరాన బాధ పెల్లుబికింది. రక్తం ఎగసిపడుతున్నది. నాకు తెలుసు నీ బాధ. నీ హృదయం ఎంతగా ఆక్రోశిస్తున్నదో నా యీ ప్రవర్తనవల్ల!

"నూరేళ్ళు మాంగల్యంతో వర్ధిల్లు యము.....నా" బాధను యిముడ్చుకొని నీవన్న ప్రతి అక్షరము నీ హృదయాన్ని చూపుతున్నది.

నాపై ఎన్నో ఆశలతో, మమకారంతో ఎన్నాళ్ళకో వచ్చిన నిన్ను ఈ విధంగా తిరస్కరించా! క్షంతవ్యురాల్ని.

కానీ నీతో ఆ విధంగా బొంకగలిగానుగానీ, ఆ తర్వాత నీ పరిస్థితిని గురించి ఊహించు కున్న కొద్దీ, నా దేహం ఉడికిపోతున్నది బావా! నే చెప్పిందంతా సర్వాబద్ధం. అంతా కల్పన, నటన.

బావా! నేను మహాపాపిని. నా గాధ మరీ నీచమైంది. అంత నీచాతినీచమైన గాధ, నాలో సదా వ్యధ రేపుతోనే వుంది.

నన్నెంతో ఉత్తమురాలిగా, పవిత్రమైనదానిగా ఎంచి, నీ హృదయంలో ప్రతిష్ఠించుకుని, ఆరాధిస్తున్నావు. నీ పవిత్ర హృదయంలో స్థానంలేనిది బావా ఈ యమున.

నీకు జ్ఞాపకమున్నదనుకుంటాను బావా ఆ నాటి మన ప్రమాణాలు. ఎన్ని విపత్కరాలు, అవాంతరాలు కలిగినా మన బాంధవ్యం చిరకాలం యిలాగే వుండాలనీ, నీవు విదేశాలలో చదువు ముగించుకు వచ్చేదాకా నీ కోసం నేను అవివాహితగా వుండాలనీ అనుకున్నాం. నామీద నమ్మకంతో సంతోషంగా స్వదేశం విడిచి వెళ్ళావు.

ఆ తర్వాతనే బావా నా జీవితగమనం అస్తవ్యస్తమైంది. నీతో గడిపిన రోజులు మననం చేసుకుంటూ, భవిష్యత్తును గురించి తీయని తలపులతో ఊహాలోకంలో తేలియాడుతున్న లోకంలో అతను ప్రవేశించాడు. పేరు డేవిడ్. అతను ఎలా నా జీవితంలో ప్రవేశించాడో నాకు తెలియదు. తీరా అతను లేంది నా జీవితం గడవదేమో అన్నంతవరకూ నన్ను వెంటాడాడు. ఎన్నో ఆశలు చూపాడు. ఊహాపథాల్లో ఉద్యానవనాలు, దివ్య భవనాలు, తీయని, మధుర మందస్మిత కోరికలు రేకెత్తించాడు. అన్నీ నమ్మాను. అప్పుడు అతడేం చెబితే అదే వేదం. శిరసా వహించేదాన్ని. అతని కోసం తపించేదాన్ని. అతడ్ని పూర్తిగా నా వాణ్ణి చేసుకోటానికి అహోరాత్రాలు తపస్సు చేస్తుండేదాన్ని. బావా ఎంతో తెలివిగలదానిని, ఏమిటో అంతా అయోమయం అయింది. అతని దాసురాల్నయాను. కులం, గోత్రం, మర్యాద, సంఘం, కని పెంచిన తల్లీ, తండ్రీ అందర్నీ దూరం చేసుకున్నాను.

నా మాయాలోకం కొన్నాళ్ళకు పతనమైంది. పతనమైన ఊహా సౌధాల శిధిలాల్లో, అనాధగా వుంది, నీ ఒకనాటి యమున. చాలా పతనమయ్యానుగదూ జీవితంలో! ఇందులో ఎవర్నీ నేను నిందించను. అంతా విధికృతం.

పాపపంకిలమైన ఈ దేహంతో ఆ నాడు నీ ముందు నిలబడ్డానికి ఎంత కృంగిపోయానో! నాలో పవిత్రత లేదు; ప్రాణాలు మాత్రం ఉన్నాయి. అవి ఈ యమునను విడిచిపోయ్యేవే! కానీ.... కానీ నాలో ఓ ప్రాణి వుంది. అది నా పాపానికి ఫలం. ఏం చెయ్యను? యీ గాధంతా ఎలా చెప్పను నీతో? నీవు నన్ను పతితగా చూస్తుంటే ఎలా భరించగలను? అందుకే ఆనాడు అర్ధరాత్రి నీతో అబద్ధమాడాను. ఆ పరిస్థితులలో అంతకన్న గత్యంతరం లేదనుకుంటాను.

నీతో అలనాడు ఆడిన ఆటలూ, పాటలూ, చేసిన బాసలు, చిరకాలపు మన బాంధవ్యం అన్నీ మదిలో మెదులుతూనే వుంటాయి. హృదయంలో శూలం పెట్టి పొడిచినట్టు బాధ. ఏం చెయ్యను? ఎవర్ని నిందించను?

బావా! ఒక్కటే కోరిక. నన్ను మనసులోంచి చెరిపెయ్యి. నా గాధ మర్చిపో. నీకు ఈ జాబు చేరే సరికే నేనెక్కడో వుంటాను - నన్ను మర్చిపో.

ఇట్లు
సదా నీ సుఖాన్ని అభిలషించే
యమున